# సీతకథ-నీతికథ

"టాయ్ కౌంటర్లో చూస్తున్న ఆ అందమైన బొమ్మ ఎవరు కొంటా?" స్టూలుమీద కూర్చొని కౌంటరు మీద నిలబెట్టిన డాన్సింగ్ డాల్‌ను వేలితో సుతారంగా కదిలిస్తూ దాని విన్యాసాలు చూచి ఆనందిస్తున్న సీత మాటలు వినవచ్చిన వైపు తిరిగి చూచింది. అందంగా, నీటుగా ఉన్న ఒక యువకుడు తీవిగా చీరల కౌంటరు ఆనుకొని నిలబడి విలాసంగా చూస్తున్నాడు.

"నిన్ననే క్రొత్తగా డ్యూటీలో చేరింది. పేరు సీత." అని శాంత ముభావంగా జవాబిచ్చి ఎవరో చూచి వదిలేసిన చీర మడతలను సరిచేయసాగింది.

"ఓహో!" స్టయిలుగా అంటూ స్టోర్సు వైపు వెళ్ళిపోయాడు. ఒంటి గంటకు ఎంపోరియం తలుపులు మూశారు. ఆ పూట అయిన అమ్మకాలను పుస్తకంలోకి ఎంటరు చేస్తూండగా రమాకాంత్ కొండపల్లి బొమ్మలను సీతకు హ్యాండోవర్ చేయడానికి వచ్చాడు.

"నా పేరు రమాకాంత్. స్టోర్సులో క్లర్కుని" అంటూ తనను పరిచయం చేసుకున్నాడు.

"నీ రాకవల్ల షోరూముకు క్రొత్త అందం వచ్చింది సుమా!" సరసంగా చనువుగా అంటూంటే సీతకు కోపం రాలేదు. సౌందర్యాన్ని ప్రశంసిస్తే ఏ యువతి పొంగిపోదు?


ఆ టైములోనే రమాకాంత్ ఆమె కుటుంబ విషయాలను అతి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నాడు.

---

జి. సరస్వతి

---

సీత తండ్రి [illegible] క్రితమే పోయారు. ఒక అన్నయ్య, తమ్ముడు చెల్లెలు ఉన్నారు. అన్నయ్య రఘు బి.ఏ.తో కుస్తీ పడుతూండగానే కళ్యాణానికి ఆశించి పెండ్లి చేశారు. బి.ఏ. అయిందనిపించి, ముగ్గురు బిడ్డల తండ్రయినా ఏ ఉద్యోగంలోను స్థిరపడలేదు. తమ్ముడు వాసు బి.ఎస్.సి; చెల్లి రాధ ఫోర్త్‌ఫారం చదువుతున్నారు. స్కూలుఫైనలు ప్యాసయిన సీత



కుటుంబానికి సహాయంగా ఉండటానికని ఉద్యోగంలో చేరింది. ఎన్నో ప్రాంతాల వారు హస్తనైపుణ్యంతో తయారు చేసిన వస్తువులు, బట్టలు కనువిందు చేస్తూ ఉంటాయి. షోకేసుల్లోని వస్తువులను ఆకర్షణీయంగా అమర్చేది సీత. మృదువైన మాటలతో వాటి చరిత్రను వినసొంపుగా చెప్పే సీత మాటలకు ముగ్ధులై చాలమంది అనుకున్నదానికంటె ఎక్కువగానే కొనేవారు. తరుచుగా వచ్చే కొందరు కస్టమర్సు ఆప్యాయంగా పలకరిస్తే మరికొందరు వెకిలిగా ప్రవర్తించేవారు. విదేశీయులు, సంస్కారవంతులైన స్వదేశీయులు ఎంతో మర్యాద నిచ్చి మాటాడేవారు. రకరకాల వ్యక్తులతో నేర్పుతో, ఓర్పుతో సంభాషించవలసి ఉండేది. ఉత్సాహంతో పనిచేసే సీత త్వరలోనే మంచి పేరు తెచ్చుకుంది. రమాకాంత్ ఏదో నెపంతో ఆమెను పలకరిస్తూ నవ్విస్తూ దగ్గరగా వచ్చాడు.

మొదటిసారిగా రమాకాంత్‌తో సినిమాకు వెళ్ళినప్పుడు సీతకు గుండెలు దడదడ లాడాయి.

"నువ్వు నాకు కావాలి సీతా!" సినిమా చూశాక యిద్దరూ ఖరీదైన

హోటలుకు వెళ్ళి ఫ్రూట్ సెలాడు తెప్పించుకున్నారు. ఫ్రూట్ సెలాడు నోటికి విందు చేస్తే అతని మాటలు వీనులకు విందు చేసి శరీరంలోని ప్రత్యణువును పులకరింప జేశాయి.

"నేనేమైనా బొమ్మనా రమాకాంత్?" అంది చిలిపిగా.

"బొమ్మననుకుంటే నీ అభిప్రాయంతో నిమిత్తం లేకుండా ఏనాడో స్వంతం చేసుకొనేవాడిని సీతా! నిన్ను వ్యక్తిగా గుర్తించబట్టి నీ యిష్టాన్ని తెలుసుకో గోరుతున్నాను" అన్నాడు.

"ఒకరితో తిరిగి యింకొకరిని చేసుకొనే స్థితికి నేనురాలేదు రమాకాంత్!" అన్నది నెమ్మదిగా. ఆమె విశాలమైన కాటుక కళ్ళలోని అందాన్ని, సునుసిగ్గు దొంతరలను చూస్తూ ముగ్ధుడైనాడు రమాకాంత్.

"మీ వాసు చదువు పూర్తయాక, రఘు స్థిరపడ్డాక పెండ్లి చేసుకుందాం సీతా." అన్నాడు. ప్రేమించానంటూ దగ్గరకు చేరి "పెళ్ళి" అనగానే మాయమైపోయే అనేకమంది యువకుల్లాగా కాకుండా రమాకాంత్ బాధ్యతో మాట్లాడుతూంటే సీత మురిసిపోయింది. ఆ తర్వాత సీత ప్రతి సెలవు రోజున అతనితో సినిమాకో, షికారుకో వెళ్తూండేది. కాని యిటువంటి రహస్య సమావేశాలు యింట్లోనివారి కంటె పై వారికే ముందుగా తెలుస్తూ ఉంటాయి. రఘు స్నేహితు డొకడు సినిమా హాల్లో వారిని చూసి రఘుతో చెప్పాడు.

కలల్లో తేలిపోతూ కూనిరాగం తీసుకుంటూ భోజనానికి వెళ్తున్న సీత, "సీతా!" అన్న గర్జన విని త్రుళ్ళిపడింది.

"కుటుంబ పరిస్థితులు బాగు లేవని ఉద్యోగానికి వెళ్ళి పోకిరీ వేషాలు వేస్తున్నావా? పరువు, ప్రతిష్ఠలు నాశనం చేస్తావా?" అన్నాడు కోపంగా. బెదిరిపోయిన సీత క్రమంగా ధైర్యం తెచ్చుకుంది.

"పరువు పోయే పని నేనేమీ చేయలేదు. రమాకాంత మా ఎంపోరియం లోనే పని చేస్తున్నాడు. నన్ను పెండ్లి చేసుకుంటాడు అంది.

"స్వయంవరమన్నమాట" అన్నాడు వెటకారంగా.

"అన్నయ్యా!" అసహనంగా అరిచింది సీత.

"పెండ్లి చేసే తాహతు లేనప్పుడు నా జీవితాన్ని నేను సరిదిద్దుకోవడం తప్పా?" సీత ప్రశ్న విని రఘు నిర్ఘాంతపోయాడు. ఎంతో నెమ్మదిగా ఉండే సీత ఎన్ని మాటలు నేర్చింది! తన అసమర్థతను ఒక్క మాటలో ఎత్తి చూపెట్టింది. ఆర్థిక స్వాతంత్ర్యమూ, నమ్మిన పురుషుని అండా ఆమె కా ధైర్యాన్నిస్తున్నాయి కాబోలు! రఘు

కాంతపడి "అనుకూలుడైన భర్త నెంచుకొంటే కాదంటానా సీతా? నువ్వే విధమైన మోసానికీ గురి కాకూడదనే నా తపన" అన్నాడు.

"రమాకాంత్ చాలా మంచివార న్నయ్యా!" అంది సీత. ఒక ఆది వారం సీత యింటికొచ్చి అల్లుడి హోదాలో మర్యాదలు పొందాడు రమాకాంత్. అందరూ అతన్నిచూచి తృప్తిపడ్డారు.

• • •

"దసరాకు నా కానుక" అంటూ రమాకాంత్ యిచ్చిన ప్యాకెట్ విప్పిచూచింది సీత. లేతనీలం చందేరీ చీరె, మ్యాచింగ్ బ్లౌజు రెండొందల రూపాయలైనా చేస్తాయి.

"ఇంత ఖరీదైన బట్టలెందుకు రమాకాంత్!" అన్నది.

"నా జీతం కాకపోయినా సీతా! నాకు మా పల్లెలో పొలం ఉంది. ఈ మధ్యనే శిస్తులందేయి. నీకుబాగుంటుం దనిపించికొన్నాను" అన్నాడు. ఎక్కడ అప్పుచేశాడోనని అనుమానించిన సీత తేలికగా నిట్టూర్చింది.

విజయదశమినాడు తలంటుకొని తనిచ్చిన దుస్తులలో అందంగా వెలిగి పోతున్న సీతను తనివితీరా చూస్తూ వాళ్ళ కుటుంబంతో కలిసి వీందారగించాడు, రమాకాంత్. ఇద్దరూ మ్యాట్నీకి వెళ్తుంటే ఎంపోరియం జైపిస్టు రంగరాజు, క్యాషియర్ కుమార వేలు చూసి అసూయతో ఉడికి పోయారు. నలభై ఏళ్ళు దాటిన, నలుగురు బిడ్డల తండ్రి అయిన రంగ రాజు, భార్యాబిడ్డలను పస్తులుంచి స్వసుఖం చూసుకునే కుమారవేలు సీతపాలిటి రాక్షసులై భంగపడిన వారే. తమను నిరాకరించి వీడితో షికార్లు చేస్తోందన్నమాట! అని కసిగా పళ్ళు నూరుకున్నారు.

మరునాడు తన నందరూ గుచ్చి గుచ్చి చూస్తూ గుసగుసలాడు కుంటూంటే సీత కొంచెం బెదిరింది. లంచ్ టైములో శాంత కాఫీ త్రాగుదా మంటూ లాక్కెళ్ళింది.

"రమాకాంత్ ఊరికే ప్రేమిం చాడా? పెళ్ళి చేసుకుంటాడా?" అని అడిగింది. సీత కా మాటలు వెటకారంలా ధ్వనించి కోపంతెప్పించాయి. కాని, క్రొత్తలో పనినేర్పి, ఎన్నో రకాలుగా ఆదుకొని తోబుట్టువులా ఆదరించిన శాంతపై కోపాన్ని ప్రదర్శించలేక పోయింది.

"మేము పెళ్ళి చేసుకుంటాము" అన్నది స్పష్టంగా.

"త్వరగా వివాహం చేసుకో సీతా! భార్యాభర్తలైపోతే విమర్శలను హేళనలను ఎదుర్కొనక్కర్లేదు, అది నీకూ క్షేమదాయకం. నీకు శుభం జరగాలని కోరేవారిలో నేను మొదటి

దాన్ని" అని కాంత అంటూంటే ఆమె అభిమానానికి సీతకళ్ళు చెమర్చాయి.

• • •


"సీతా!" వినిపించుకోనట్లు కూర్చుండిపోయింది. అలుక ఆమె ముఖానికి తెచ్చిన అందాన్ని చూస్తూ కొంతసేపు తానూ మౌనం వహించాడు రమాకాంత్. కాని ఎంతసేపటికీ ఆమె మాట్లాడక పోయేసరికి తనకి కంగారు పుట్టింది.

"నీ కంత కోపంవస్తే బ్రతకగల్గనా సీతా? కారణం చెప్పవూ?" అని ఆతృతతో అడిగాడు.

"మా అన్నయ్య ఉద్యోగంలో స్థిరపడ్డాడు. వాసుకు డిగ్రీ, ఉద్యోగం వచ్చాయి. అయినా మన పెండ్లిని వాయిదావేసి నన్ను నిందపాలు చేయడం న్యాయంగా ఉందా?" రమాకాంత్‌కు ఆమె మనస్సులోని బాధ అర్థమైంది.

"ప్రేమికులుగా ఉండటంలోని థ్రిల్‌ను కొన్నాళ్ళు అనుభవించాలన్న కోరికేకాని దురుద్దేశమేమీ లేదు సీతా! ఇద్దర్లం వేర్వేరుగా ఉంటూ, యిట్లా కలుసుకోవడంకోసం నిరీక్షించడంలో అమూల్యమైన యీ క్షణాలను ఆనందమయం చేసుకోవడంలో ఎంత మాధుర్యం ఉంది సీతా! పెండ్లయితే యింత స్వేచ్ఛగా విహారించగా తిరగ్గలమా?" అన్నాడు.

"బాధ్యతలు నెత్తిన పడతాయని



[...] లంచాలు తీసుకుంటున్నా [...] తెలిసింది. ఏంచెయ్యమంటావ్?"

"విచారించండి!"

యిట్లా ఉండిపోగలమా రమాకాంత్! బాధ్యతల్లో మాత్రం మాధుర్యంలేదా? పెళ్ళికాకుండా ఏ పొరపాటు జరిగినా నా జీవితం నాశనమైపోదా?" అన్నది సీత భయసందేహాలతో.

"నే నెన్నడైనా హద్దు మీరానా సీతా? ఒకవేళ అట్లా జరిగినా నిన్ను అన్యాయం చేస్తానని కలలోకూడ అనుకోకు. త్వరలో నే మన వివాహానికి ఏర్పాట్లు చేస్తాను" అన్నాడు.

• • •

మాఘమాసం రాగానే మంచి రోజు చూసి కంచిపట్టు చీర, ఉంగరం, పూలు, పళ్లు పట్టుకొని వెళ్ళాడు.

నిశ్చితార్థం సీత యింట్లో కాస్త హడా విడిగానే జరిగింది. ఇరుగు పొరుగులు, సీత అందమైన యువకుణ్ణే ఎన్ను కొన్నందుకు పైకి ఆనందం ప్రకటిం చారు. లోలోపల ఆసూయ చెందారు. విందు భోజనాలైనాక యిద్దరూ సిని మాకు బయలుదేరారు.

"త్వరలో 'మన' కాబోతున్న 'నా' రూముకు నీ వీ రోజు రావాలి సీతా!" అన్నాడు సినిమానించి తిరిగిస్తూం డగా. సీత అభ్యంతరం పెట్టలేదు. నీటుగా వున్న ఆ చిన్న గదిని నలువైపులా చూస్తూంటే రమాకాంత్ కాఫీ తెచ్చాడు ఇద్దరూ త్రాగారు.

"నా ప్రత్యేకమైన కానుక ఏకాం తంలో స్వయంగా నీకివ్వాలని దాచాను సీతా!" అని రమాకాంత్ చిన్నపెట్టె తెచ్చి ధగధగలాడుతున్న రాళ్ళ నెక్లేసు చేతిలోకి తీసుకుని ఆమె మెడలో పెట్టబోయాడు. పాముని చూచినట్లు బెదిరి సీత వెనకడుగు వేసింది. సీత మొహంలో కదుచుకుంటున్న భయాన్ని అనుమానాన్ని గమనించి రమాకాంత్ విస్తుపోయాడు.

"నీకు నచ్చలేదా సీతా? క్షణంలో ఎందుకట్లా మారిపోయావ్" అని అడి గాడు.

"ఆడంబరాలు మనకొద్దు రమా కాంత్!" అన్నది సీత.

"కాబోయే భార్య అందంగా కన బడాలనుకోవడం తప్పా సీతా!"

"అందంగా కనబడాలంటే తాహ తుకు మించిన వస్తువులు అవసరమా రమాకాంత్? ఆడంబరాలమీద, ఫ్యాషన్లమీదహద్దుమీరిన వ్యామోహాన్ని పెంచుకుంటే వాటిని తీర్చుకోవడం కోసం అడ్డదారితొక్కవలసి రావచ్చు. అన్నంపెట్టే సంస్థకే ద్రోహం తల పెట్టే దుస్థితి రావచ్చు. నీతిగా నిరాడంబరంగా బ్రతకగలిగే అవకాశం ఉన్నప్పుడు తప్పుదారిన పడటం క్షమార్హంకాని నేరం!" అన్నది ఆవే శంగా.

"అంటే కనీసావసరాలు తీర నప్పుడు అవినీతికి పాల్పడవచ్చునని నీ అభిప్రాయమా సీతా?"


"కాదు. కాని అటువంటి పరిస్థి తిలో తప్పుదారి తొక్కిన వారిని సంఘంలో కొందరైనా అర్థం చేసుకో గలుగుతారు. సానుభూతితో, చేయూత నిచ్చి మంచి మార్గానికి మళ్ళించగలుగు తారు" అన్నది. నెక్లేసువైపే తదే కంగా చూస్తున్న రమాకాంత్ మాట్లాడ లేదు. సీతకు చటుక్కున తండ్రి గుర్తుకు వచ్చాడు. తన తల్లికి ఆడంబ రాలమీదవుండే మోజువలన తండ్రి నెట్లాగయినా డబ్బు సంపాదించమని వేధిస్తూ ఉండేది. ఆమె ప్రోద్బలం వలన, సహజంగావున్న బలహీనత

వలన లంచాలు తీసుకోవటం మొదలు పెట్టాడు. అయితే అప్పటినుండి అశాంతితో, భయంతో బాధపడుతున్నట్లు కనబడేవాడు. చివరకొకనాడు పాపం పండి ఉద్యోగం పోయింది. కుటుంబాన్ని గూర్చి బెంగా, అవమానం వాటిని కొద్దిరోజులకే మృత్యువు కప్పగించాయి.

తనకోసం రమాకాంత్ ఏమైనా కాని పనులు చేస్తాడేమోననిపించి సీత వణికిపోయింది.

"వద్దు రమాకాంత్! ఇంకెప్పుడూ నన్నడగకుండా శక్తికి మించిన ఖర్చు చేయవద్దు. సామాన్యంగా, నీతిగా, నిర్భయంగా, నిశ్చింతగా బ్రతుకుదాం" అంటూ చప్పున అతని చేతులు పట్టుకొంది.

"నాకు శిస్తులు వస్తాయని చెప్పానుగా సీతా! అయినా నన్ను నమ్మలేవా?" అన్నాడు. నమ్మకపోవడం కాదు. "భవిష్యత్తుకోసం డబ్బు దాచుకోవద్దా?" అంటూంటే సీత ముఖం సిగ్గులో ఎర్రనైంది. రమాకాంత్ ఇక నిగ్రహించుకోలేక ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకొని పెదవులను మృదువుగా చుంబించాడు. చిరుకోపం నటిస్తూన్న సీత మెడలో నెక్లేసుపెట్టి అద్దం దగ్గరకు తీసుకొని వెళ్ళాడు. సీత తనను చూసుకొని మురిసిపోయింది. ప్రక్కకు తిరిగేసరికి షెల్ఫులో ఉలిపిరి కాగితంలోంచి



చూస్తున్న దంతపు విగ్రహం కనబడింది. కుతూహలంతో తీసి జాగ్రత్తగా విప్పి టేబిలుమీద నిలబెట్టింది. రతీమన్మధుల విగ్రహమది. అడుగు ఎత్తులో, జీవం ఉట్టిపడుతూ చూపరులను ముగ్ధులను చేస్తూంది.

"టి. నగర్ బ్రాంచికి వచ్చిన ఒక కస్టమరు ఆర్డరు యిచ్చాడట. రేపు కట్టడ యిచ్చిరావాలి" అన్నాడు తీసి కాగితంలో చుట్టేస్తూ.

"పొద్దుపోయింది. నేనింక వెళ్తాను" అంటూ సీత లేచింది.

"అప్పుడేనా?" అంటూ రమా

కాంత్ చేయిపట్టి దగ్గరకులాక్కున్నాడు. ఇద్దరూ తొలిసారిగా జీవన మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించారు. రాత్రి ఎనిమిదిగంటలైనాక సీతను ఇంటికి దిగబెట్టి వదలలేక, వదలలేక వెళ్ళిపోయాడు రమాకాంత్.

* * *

మధుర స్వప్నాల్లో తేలిపోతూ, విరహంతో వేగిపోతూ సీత మరునాడు పదినిమిషాలుఆలస్యంగా ఎంపోరియం చేరింది. మేనేజరు, స్టోర్సు ఆఫీసరూ కంగారుగా తిరుగుతున్నారు. సేల్సు గర్ల్సు యిద్దరూ షోరూము నలుపైపులా వెదుకుతున్నారు.

"ఏమైంది శాంతా?" అని అడిగింది సీత.

"నాలుగు నెలల క్రితం హారిసన్ అనే అమెరికన్ మూడు దంతపు విగ్రహాలకు ఆర్డరిచ్చారు. వాటిని పంపినట్లు ఉత్తరం, ఇన్‌వాయిస్ వచ్చాయి. అతను వాటిని కొనడానికి రేపు వస్తున్నట్లు ఉత్తరం వ్రాశారు. పెట్టెలో చూస్తే ఒక్క విగ్రహమే ఉంది" అన్నది శాంత.

"పొరపాటున టి. నగర్‌కు పంపారేమో? కనుక్కున్నారా?" అని అడిగింది.

"అక్కడకు పంపలేదు. అక్కడ లేదని తెలుసుకునే వెదుకుతున్నారు." అన్నది శాంత. సీత మనస్సులో భయమూ, ఆందోళన బయలుదేరాయి. ఇన్‌వాయిస్‌లో వర్ణన ప్రకారమేఉన్న రతీ మన్మధుల విగ్రహం కళ్ళముందు నిలిచింది. రమాకాంత్ "దొంగ" అని ఎవరో అరచినట్లయింది. వణుకుతున్న కంఠంతో శాంతతో సంగతంతా చెప్పింది.

ఒంటిగంటకు అందరూ ఆసంగతే మాట్లాడుకుంటూ బైటికి వెళ్ళారు. రమాకాంత్ రాకపోవడాన్ని గమనించింది సీత. మేనేజరు ఏం చేయడానికి తోచక గదిలోపచార్లు చేస్తున్నాడు. శాంత నెమ్మదిగా విషయమంతా చెప్పింది. అవమాన భారంతో, దీన వదనంతో తలవాల్చుకున్న సీతను చూస్తూ అమితంగా జాలిపడ్డాడు మేనేజరు. పరిస్థితుల ప్రోద్బలంవలన ఉద్యోగానికి వచ్చి ఆడంబరాలమీది వ్యామోహంతోనో ప్రేమించి పెళ్ళిచేసుకుందామనే తపనతోనో వయసు చేసే గారడీలకు వశమైపోయి, ఒక్కొక్కసారి దగాపడిపోయే యువతులంటే అతనికెంతో సానుభూతి. అటువంటి స్థితిలోకూడ న్యాయానికి తల ఒగ్గిన సీత అంటే అతనికి గౌరవం కలిగింది. వారిని వెళ్ళమని చెప్పి జరుపవలసిన కార్యక్రమాన్ని గురించి ఆలోచిస్తూ కారువైపు నడిచాడు.

హుషారుగా ఈల వేసుకుంటూ రూముకు తాళం వేస్తున్న రమాకాంత్ గంభీరవదనంతో వచ్చి నిలబడిన మేనేజరును చూచి కంగారుపడ్డాడు. అయినా సర్దుకుంటూ "నమస్తే సార్" అన్నాడు.

"రతీ మన్మధుల విగ్రహాన్నెంత కమ్మావు రమాకాంత్ ?"

"నేనా....! నాకేం తెలీదే!" అన్నాడు తడబడుతూ.

"సీత ఆ విగ్రహాన్ని నీ రూములో చూసింది కదూ ఇటీ.[illegible] బ్రాంచి కివ్వాలని చెప్పావుటకదూ!" అన్నాడు మేనేజరు. రమాకాంత్‌కు సర్వం అర్థమైంది. తన ప్రేయసి సీత తన దోషాన్ని బైట పెట్టిందనే సరికి వైరాగ్యంలాటిదేదో మనస్సు నావరించుకుంది. ఖిన్నవదనంతో మేనేజరు వెంట నడిచాడు.

• • •

రమాకాంత్ అపహరించిన వస్తువుల విలువ సుమారు మూడువేలవరకు తేలింది. సీతకిచ్చిన నెక్లేసు, ఉంగరం కొంత నష్టాన్ని భర్తీ చేశాయి. రమాకాంత్‌కుశిక్ష ధించబడింది. రమాకాంత్‌ను నమ్మి స్టోర్సుపూర్తిగా స్వాధీనం చేసి నిర్లక్ష్యం చేసిన స్టోర్సు ఆఫీసరును తీవ్రంగా మందలించారు.

సీత పోస్టులో రాజీనామా పంపింది.

• • •

తాను తల్లి కాబోతున్నట్లు తెలుసుకున్న సీతకు నెత్తిన పిడుగుపడినట్లయింది. తానేం అపరాధం చేసిందని తనను విధి యింత క్రూరంగా శిక్షించింది! తనతో అన్ని విధాలా సరితూగిన రమాకాంత్‌ను పెండ్లి చేసుకొని అనురాగాన్నే ఐశ్వర్యంగా చేసుకొని జీవించాలనుకుంది కాని అత్యాశకుపోలేదు! అతను చెప్పిన ఒక్క అబద్ధాన్ని తాను నమ్మటంవలన ఇంతటి దుస్థితి వచ్చింది! కోటి కోర్కెలతో, నిండు మనస్సుతో, తన్ను ప్రేమించిన రమాకాంత్‌ దొంగ అనే సంగతి మాటిమాటికి గుర్తుకువస్తూ ఆమెను దహించసాగింది. చీకటి మయంగా వున్న తన బ్రతుకును తల్చుకొని

---

## మామ్ ఇన్ డైలమా

స్పెయిన్లో సామర్సెట్ మామ్ రాయల్టీస్ రూపేణా కొన్నివేలు జమచేశారు. వాటినెలా చెలామణిలోకి తేవాలా అని డైలమాలోపడి చివరికి కొన్ని రోజులుఅక్కడేగడిపి వాటిని ఖర్చుపెడదామనుకున్నాడు ఒక హైక్లాసుహోటల్లో బసచేసి[illegible]ఖర్చుత్తానికి సరిపడ బిల్లు అయ్యేట్టు చూశాడు. ఆ హోటల్‌కి గుడ్‌బై చెప్పదలచి బిల్లుకోసం కబురంపగా, మేనేజరిలా అన్నాడు. "మా హోటల్లో మీలాంటి వారు బస చేయడమే మాకెంతో గర్వకారణం. దేర్‌ఫోర్ బిల్లు కాన్సిల్ చేస్తున్నాం

కన్నీరు మున్నీరుగా విలపిస్తూన్న సీత వద్దకు రఘు కూతురు వచ్చి "అత్తా! ఉత్తరం" అంటూ కవరిచ్చింది. రమాకాంత్ దస్తూరి గుర్తించి విప్పింది.

సీతా!

నన్ను చాల అసహ్యించుకొని వుంటావుకదూ! ఈ ఉత్తరంపూర్తిగా చదివాకయినా నన్నర్థం చేసుకుంటావని తలుస్తున్నాను. సీతా! నేను, గాలికి పుట్టి ధూళికి పెరిగిన వాడిని, ఒక దయాసముద్రుని సహాయంతో చదువుకొని యింకొక ఉదారుని దయతో ఉద్యోగాన్ని సంపాదించుకున్నాను. ఆత్మీయులు లేనినా బ్రతుకులోకి వసంతంలాగ వచ్చావు సీతా? నిన్ను చూశాక నా జీవితంలోని వెల్తి అర్థమైంది. ఇల్లూ, ఇల్లాలు కావాలనిపించింది. నువ్వుకూడ అంగీకరించడంతో నా ఆనందానికి అవధులు లేకపోయాయి. నా అందాలసీత పేదగా ఉండటాన్నిసహించలేకపోయాను. నాసీతను అలంకారాల్లో నింపి, విలాసాల్లో తేలిపోవాలని తలచి సంపాదన చాలక అడ్డదారి త్రొక్కాను. అమ్మాయిలు డబ్బుతో వచ్చే సుఖాలను కోరుకుంటారని, ఆ డబ్బు ఎట్లా పురుషుడు సంపాదిస్తున్నాడో పట్టించుకోరని తలచాను. కాని కొందరమ్మాయిలు నీతిని, నిజాయితీని, నిరాడంబరతను ప్రాణంకంటె మిన్నగా ప్రేమిస్తారు. అవినీతిని బయటపెట్టవలసి వచ్చినప్పుడు సమస్తాన్ని త్యాగం చేయవలసి వచ్చినా వెనుకాడరని నిరూపించావు. సీతా! మణిపూసలాంటి నిన్ను అవివేకంతో దూరం చేసుకొన్నందుకు ఎంత కుమిలిపోతున్నానో దేవునికే తెలుసు.

కాని సీతా! నేను దొంగనైనా నీ మీది అనురాగం మాత్రం అబద్ధమైందికాదు. మారిన మనిషిగా నీ ఎదుటకు వచ్చినప్పుడుమన్నించి, చేయూతనిస్తావని కొండంత ఆశతో ఉన్నాను. నా నమ్మకాన్ని వమ్ము చేయవుకదూ!

జన్మజన్మాలకు నీవాడైన<br>
రమాకాంత్."

తనకోసం రమాకాంత్ తప్పుదారి తొక్కి జీవితాన్నినాశనం చేసుకొన్నందుకు అవినీతితో ముడిపడిన తన బ్రతుకు రాళ్ళపాలయినందుకు, సీత అతని ఉత్తరాన్ని ముఖానికి కప్పుకొని గలగలా ఏడ్చింది. ఆత్మీయుల నిరాదరణతో జీవచ్ఛవమైపోయింది. చటుకున దృఢనిశ్చయానికి వచ్చి అల్మైరాలోని నిద్ర మాత్రల సీసాను చేతిలోకి తీసుకుంది. ఆ రాత్రికే యీ లోకాన్ని వీడిపోయింది.

• • •

ఆ తరువాత చాలసార్లు బీచిలోను, సినిమాహాల్సువద్ద, హోటల్సువద్ద, ఎంపోరియం సమీపంలోను "సీతా, సీతా!" అని అరుచుకుంటూ, దీనంగా చూస్తూ వెదుక్కుంటూ తిరుగుతున్న రమాకాంత్ కనబడ్డాడు. ...